



# కరపత్రం

SINCE 2014

మంగళవారం నవంబర్ 11 2025 | సంపుటి : 2 | సంచిక : 37 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4





# నేడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక

- బీహార్‌లో రాహుల్ ఓట్ చోరీ పనిచేసేనా?-
- పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి
- పోలింగ్ కేంద్రాలు తయ్యారు అని ఎన్నికల సిబ్బంది
- డ్రోన్ల ద్వారా పోలింగ్ కేంద్రాల పర్యవేక్షణ


**హైదరాబాద్,నవంబర్10**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. మంగళవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో మొత్తం 4 లక్షల 1,365 మంది ఓటర్లు ఉన్నారు. 58 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. ఎన్నికల కోసం 407 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో నాలుగు ఈవీఎంలను ఏర్పాటు చేశారు. కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియం నుంచి పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను తరలింపు ప్రక్రియ మొదలైంది. సిబ్బందికి ఈవీఎంలు, పోలింగ్ సామాగ్రిని అధికారులు పంపిణీ చేస్తున్నారు. సాయంత్రం కల్లా పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు తరలించనున్నారు. 3 వేల మంది పోలింగ్ సిబ్బంది, 2 వేల మంది పోలీసులతో కలిపి మొత్తం 5 వేల మంది పోలీసులు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల విధుల్లో ఉన్నారు. మొత్తం 407 పోలింగ్ కేంద్రాల్లో 226 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించారు. ఈసారి డ్రోన్ల ద్వారా పోలింగ్ కేంద్రాల పర్యవేక్షణ జరుగనుంది. 103 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి.లయ్యాయి. సమస్యాత్మక ప్రాంతాల్లో కేంద్ర బలగాలతో భద్రత కట్టుదిట్టం చేయనున్నారు. 45 ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 230 మంది రౌడీ షీటర్లను బైండోవర్ చేశారు. ఎంసీసీ నిబంధనలు అతిక్రమించిన 27 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. కాగా.. జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో ఉపఎన్నిక అనివార్యమైంది. బీఆర్ఎస్ నుంచి మాగంటి గోపీనాథ్ భార్య మాగంటి సునీత బరిలో ఉండగా.. కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్ యాదవ్, బీజేపీ అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డి పోటీలో ఉన్నారు. మూడు ప్రధాన పార్టీల నేతలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఎలాగైన ఉప ఎన్నికలో గెలవాలని బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు తీవ్రంగా కృషి చేశాయి. మరి జూబ్లీహిల్స్ ప్రజలు ఎవరికి పట్టం కట్టనున్నారో చూడాలి.

# మాయమైన మనిషి అందెశ్రీ

## తిరిగిరాని లోకాలకు వెళ్లిన తెలంగాణ గొంతుక

- అస్వస్థతతో తెల్లవారు జామున కన్నుమూత
- తెలంగాణ గొంతుకగా పాటలతో ఉత్తేజ పరిచిన స్వరం
- తెలంగాణ గీతంగా అందెశ్రీ జయ..జయహే తెలంగాణ
- తీవ్ర విచారం వ్యక్తం చేసిన రేవంత్, కెసిఆర్, చంద్రబాబు
- పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలకు ఆదేశం






**హైదరాబాద్,నవంబర్10:**

మనిషిన్నవాడు మాయమై పోయాడు. మానవ్వం ఉన్న చోటుకు తిరిగి రాకుండా పోయారు. పల్లె అన్నీ నేర్పిందన్న ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ కన్నుమూశారు. 64 ఏండ్ల అందెశ్రీ కొతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆదివారం రాత్రి లాలాగూడలోని తన నివాసంలో ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయారు. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన గాంధీ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన అందెశ్రీ రచించిన 'జయజయహే తెలంగాణ' పాటను రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర గేయంగా గుర్తించింది. 1961, జూలై 18న ఉమ్మడి వరంగల్ జిల్లా మద్దూరు మండలం రేబర్తిలో అంటే ప్రస్తుతం సిద్దిపేట జిల్లాలో ఉన్న రేబర్తిలో అందెశ్రీ జన్మించారు. ఆయన అసలు పేరు అందె ఎల్లన్న. భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేశారు. పాఠశాల చదువు లేకుండానే కవిగా రాణించారు. 'మాయమై పోతున్నడమ్మ మనిషన్నవాడు' అనే పాటతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అశు కవిత్వం చెప్పడంలో దిట్ట అయిన అందెశ్రీ.. ప్రజాకవి, ప్రకృతి కవిగా ప్రసిద్ధి చెందారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. తన పాటలతో ప్రజలను ఉత్తేజితులను చేశారు. తెలంగాణ రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ'తోపాటు ఎన్నో పాటలు రాశారు. కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. 2006లో గంగ సినిమాకు నంది పురస్కారం అందుకున్నారు. 2014లో అకాడమీ ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్ డాక్టరేట్, 2015లో దాశరథి సాహితీ పురస్కారం, రావూరి భరద్వాజ సాహితీ పురస్కారం, 2022లో జానకమ్మ జాతీయ పురస్కారం, 2024లో దాశరథి కృష్ణమాచార్య సాహితీ పురస్కరం, లోక్‌నాయక్ పురస్కారం అందుకున్నారు.అందెశ్రీ ఆకస్మిక మృతిపట్ల తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ' రాసిన అందెశ్రీ మరణం తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటు అని పేర్కొన్నారు.

# ఢిల్లీ ఎర్రకోట వద్ద భారీ పేలుడు

- కారులో పేలుడు పదార్థాలను రిమోట్‌తో పేల్చివేత
- 8మంది మృతి..పలువురికి గాయాలు
- ఢిల్లీలో రెడ్ అలర్ట్ ప్రకటించిన పోలీసులు
- ముమ్మరంగా గాలింపు చర్యలు

**న్యూఢిల్లీ,నవంబర్10 :**

దేశ రాజధాని దిల్లీలో భారీ పేలుడు సంభవించింది. ఎర్రకోట మెట్రో స్టేషన్ గేట్ నంబర్ 1 వద్ద పార్కింగ్ స్థలంలో నిలిపి ఉంచిన ఓ కారులో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 8 మంది మృతి చెందగా 24 మంది గాయపడ్డారు.






# ఎమ్మెల్యేల ఫిరాయింపు వ్యవహారం

- గడువులోగా విచారించని స్పీకర్
- మరోమారు సుప్రీం గడప తొక్కిన బిఆర్ఎస్

**న్యూఢిల్లీ,నవంబర్10 :**

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై సుప్రీంకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. ఫిరాయింపు ఎమ్మెల్యే అనర్హత పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు ముగిసినా, ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఈ పిటిషన్ దాఖలు చేసింది.





# మరోమారు పెరిగిన బంగారం ధరలు

**24 క్యారెట్ల బంగారం ధర 1, 23, 220కి చేరిక**

**హైదరాబాద్,నవంబర్10**

ఇటీవలి కాలంలో వరుసగా తగ్గుతూ వస్తున్న బంగారం ధర సోమవారం మళ్లీ పెరిగింది. తీసుకుంది. 10వతేదీ ఉదయం 9 గంటల తర్వాత బంగారం ధర భారీగా పెరిగింది.



# ఢిల్లీ సమీపంలో భారీగా ఆయుధాల స్వాధీనం

- 2,900 కిలోల ఐఈడీ తయారీ పదార్థాల స్వాధీనం
- హర్యానాతో కలసి కాశ్మీర్ పోలీసుల ఆపరేషన్
- పలువురు ఉగ్రవాదుల అరెస్ట్.. వారిలో నలుగురు డాక్టర్లు

**న్యూఢిల్లీ,నవంబర్10 :**

దేశ రాజధాని ఢిల్లీ సమీపంలో ఉగ్రవాదులకు సంబంధించిన ఆయుధాలు భారీఎత్తున లభ్యమయ్యాయి. హరియాణాలోని ఫరిదాబాద్‌లో 350 కిలోల అమ్మోనియం నైట్రేట్ సంబంధిత పేలుడు పదార్థాలు,

2లో

# కేపీసీ సంస్థ కార్యాలయాల్లో జీఎస్టీ అధికారుల సోదాలు




**హైదరాబాద్:**

నగరంలోని పంజాగుట్ట, బేగంపేటలో ఉన్న కేపీసీ ప్రాజెక్టు సంస్థకు చెందిన కార్యాలయాల్లో సోమవారం మధ్యాహ్నం నుంచి జీఎస్టీ అధికారుల సోదాలు కొనసాగుతున్నాయి. ఏడు బృందాలుగా విడిపోయి తనిఖీలు చేస్తున్నారు. ఈ సంస్థ వ్యాపార లావాదేవీలు, జీఎస్టీ చెల్లింపులకు వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. దీంతో వాణిజ్య పన్నుల కమిషనర్ రఘునందన్‌రావు ఆదేశాలతో అధికారులు సోదాలు చేపట్టారు. అర్ధరాత్రి వరకు తనిఖీలు కొనసాగే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

# కాంగ్రెస్ మద్యం, డబ్బులు విచ్చలవిడిగా పంపిణీ చేస్తోంది: హరీశ్‌రావు

**హైదరాబాద్:**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ మద్యం, డబ్బును విచ్చలవిడిగా పంపిణీ చేస్తోందని.. లక్షకు పైగా చీరలు, మిక్సీలను ఓటర్లకు ఎరగా వేస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ఈ మేరకు భారత రాష్ట్ర సమితి నేతలతో కలిసి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. అన్ని వీడియో, ఫొటోల ఆధారాలను ఎన్నికల సంఘానికి అందజేసినట్లు తెలిపారు.




# అత్యాధునికంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్

- శంషాబాద్ విమానాశ్రయం తరహాలో ఆధునీకరణ
- రూ.715 కోట్లతో రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు
- స్టేషన్‌లో 26 లిఫ్టులు, 32 ఎస్కలేటర్లు ఏర్పాటు
- రైల్వేస్టేషన్ కోసమే ప్రత్యేకంగా 2 సబ్‌స్టేషన్ల నిర్మాణం
- ప్రత్యేకంగా 5 మెగావాట్ల సౌరవిద్యుత్ ప్లాంటు ఏర్పాటు
- ఆధునీకరణ పనులను పరిశీలించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్,నవంబర్10 :**

శంషాబాద్ విమానాశ్రయం మాదిరిగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను తీర్చిదిద్దుతున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. అత్యాధునిక సౌకర్యాలతో అధునాతనంగా రూపుదిద్దుకోబోఓతోందని అన్నారు. వచ్చే ఏడాది డిసెంబర్‌లోగా ఆధునీకరణ పూర్తవుతుందని అన్నారు. సోమవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలించిన అనంతరం.. మీడియాతో ఆయన మాట్లాడారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను మెట్రో మార్గంతో అనుసంధానం చేస్తున్నట్లు చెప్పారు. రూ.715 కోట్లతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు




సాగుతున్నాయి. స్టేషన్‌ను 1.65 లక్షల చ.మీ మేర కొత్తగా నిర్మిస్తున్నాం. ఈ స్టేషన్‌కు నిత్యం 1.97లక్షల ప్రయాణికులు వస్తుంటారు. 2.70లక్షల మంది ప్రయాణికుల అవసరాలకు తగినట్లు నిర్మిస్తున్నాం. నడుస్తున్న రైళ్లు, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా పనులు చేయాల్సి వస్తోంది.

# ఢిల్లీ సమీపంలో భారీగా ఆయుధాల స్వాధీనం

మొదటిపేజీ తరువాయి
ఒక రైఫిల్ సహా 20 టైమర్లను స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక పోలీస్ కమిషనర్ సతేందర్ కుమార్ గుప్తా వెల్లడించారు. ఉగ్రనిరోధక చర్యల్లో జమ్మూకశ్మీర్ పోలీసులు భారీ విజయం సాధించారు. హరియాణా పోలీసులతో కలిసి నిర్వహించిన సంయుక్త ఆపరేషన్‌లో అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ ఉగ్ర మాడ్యూల్ గుట్టురట్టు చేశారు. నిషేధిత జైషే మహమ్మద్, అన్సార్ ఘజ్వత్-ఉల్-హింద్ ఉగ్రసంస్థలతో సంబంధం ఉన్న ఎనిమిది మందిని అరెస్టు చేశారు. ఇందులో ముగ్గురు వైద్యులూ ఉన్నారు. ఈ క్రమంలోనే పెద్దఎత్తున ఆయుధాలు, మందుగుండు సామగ్రితోపాటు 2,900 కిలోల ఐఈడీ తయారీ పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. జమ్మూకశ్మీర్ పోలీసు ప్రతినిధి వెల్లడించిన వివరాల ప్రకారం..అక్టోబరు 19న శ్రీనగర్‌లోని బన్‌పొరా నౌగామ్ ప్రాంతంలో పోలీసులు, భద్రతాబలగాలను లక్ష్యంగా చేసుకుని.. జైషే మహమ్మద్ పోస్టర్లు వెలిశాయి. ఈ వ్యవహారంపై ఉపా చట్టంతోపాటు ఆయా చట్టాల కింద కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా.. ఉగ్రవాద భావజాలం కలిగిన విద్యార్థులు, ప్రొఫెషనల్స్‌తో కూడిన ఓ ఉగ్రవ్యవస్థ వెలుగుచూసింది. ఈ బృందానికి పాకిస్థాన్, ఇతర దేశాల నుంచి పనిచేస్తున్న హ్యాండ్లర్లతో సంబంధాలున్నాయి. సామాజిక, ధార్మిక కార్యక్రమాల ముసుగులో అవసరమైన నిధులు సేకరించారు. వ్యక్తుల్లో తీవ్రవాద భావజాలాన్ని ప్రేరేపించి ఉగ్రసంస్థల్లో చేర్పించడం, లాజిస్టిక్స్ ఏర్పాటు, ఆయుధాలు, మందుగుండు సామగ్రితోపాటు ఐఈడీల తయారీకి అవసరమైన పదార్థాల సేకరణలో పాల్గొన్నట్లు గుర్తించాం. ఈ కార్యకలాపాల సమన్వయం కోసం నిందితులు ఎన్‌క్రిప్టెడ్ ఛానెళ్లను ఉపయోగించారని పోలీసు ప్రతినిధి వెల్లడించారు. ఉగ్ర పోస్టర్లు అంటించిన డాక్టర్‌ను విచారిస్తే భారీ ఆయుధ డంప్ వెలుగులోకి.. వచ్చింది. అరెస్టైన వైద్యుల్లో జమ్మూకశ్మీర్‌లోని కుల్గాంకు చెందిన డా.ఆదిల్, పుల్వామాకు చెందిన డా.ముజమ్మిల్ అహ్మద్, లఖ్‌నవూకు చెందిన డా.షాహీన్ ఉన్నారు. హరియాణాలోని ఫరీదాబాద్‌లో డా.ముజమ్మిల్ అహ్మద్ అద్దె నివాసంలో పోలీసులు భారీ ఎత్తున పేలుడు పదార్థాలు, ఆయుధాలు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఇతడు అల్ ఫలాహ్ విశ్వవిద్యాలయంలో బోధకుడిగా పనిచేస్తున్నాడు. శ్రీనగర్‌లో జైషే మమహ్మద్ పోస్టర్లు వేసిన కేసులోనూ వాంటెడ్‌గా ఉన్నాడు. ఇతడిని అరెస్టు చేసినట్లు అంతకుముందు ఫరీదాబాద్ కమిషనర్ సతేందర్ కుమార్ గుప్తా వెల్లడించారు. మరోవైపు.. షాహీన్ కారులో ఓ ఏకే-47 రైఫిల్ లభ్యమైంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా జమ్మూకశ్మీర్ లోని ఆయా ప్రాంతాలతోపాటు హరియాణాలోని ఫరీదాబాద్, ఉత్తర్‌ప్రదేశ్‌లోని సహారన్‌పుర్‌లో స్థానిక పోలీసులతో కలిసి సోదాలు నిర్వహించాం. ఈ క్రమంలోనే మరికొంతమంది నిందితుల పాత్ర బయటపడింది. వారినీ అరెస్టు చేస్తాం. ఇప్పటివరకు ఓ చైనీస్ స్టార్, బెరెట్టా పిస్టల్స్, ఏకే 56, ఏకే క్రింకోవ్ రైఫిళ్లు, 2,900 కిలోల ఐఈడీ తయారీ పదార్థాలు స్వాధీనం చేసుకున్నాం. నిధులకు సంబంధించి దర్యాప్తు కొనసాగుతోందని జమ్మూకశ్మీర్ పోలీసు ప్రతినిధి తెలిపారు. వీటితో పాటు మూడు మ్యాగజైన్లు, పిస్టల్, వాకీటాకీ సెట్‌ను స్వాధీనపరచుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. శ్రీనగర్‌లో అక్టోబర్ 27న జైష్-ఎ-మహమ్మద్ ఉగ్రవాద సంస్థకు మద్దతుగా పలు పోస్టర్లు వెలిశాయి. వీటిని కశ్మీర్‌కు చెందిన వైద్యుడు ఆదిల్ అహ్మద్ రాథర్ వేసినట్టు సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు పసిగట్టారు. సదరు వ్యక్తి ఉత్తర్ ప్రదేశ్ సహరాన్‌పుర్‌లోని ఓ ఆస్పత్రిలో వైద్యుడిగా సేవలందిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. అతణ్ని గతవారం అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు. నిందితుడు గతేడాది అక్టోబర్ ముందువరకూ అనంత్‌నాగ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో విధులు నిర్వర్తించాడని, అక్కడ అతని లాకర్‌ను తనిఖీ చేయగా ఒక రైఫిల్ దొరికిందని తెలిపారు. అతను ఇచ్చిన సమాచారం ప్రకారమే ఫరిదాబాద్‌లో ఈ రికవరీ జరిగినట్టు వెల్లడించారు. నిందితుడు రాథర్ చెప్పిన ప్రకారం.. ముజామ్మిల్ షకీల్ అనే మరో డాక్టర్ వద్ద కూడా పేలుడు పదార్థాలు, ఆయుధ సామాగ్రి నిల్వ ఉన్నట్టు తేలింది. దీంతో పుల్వామాకు చెందిన షీకల్‌నూ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇతడు ఫరిదాబాద్‌లోని ఆల్-ఫలాహ్ ఆస్పత్రిలో పనిచేస్తున్నాడు. ఈ ఘటనకు సంబంధించి ఓ మహిళా వైద్యురాలి కారులో ఒక రైఫిల్, పిస్టల్ బయటపడ్డాయి. ఆమె మందుగుండు సామాగ్రిని నిల్వచేసేందుకు వినియోగించిన కారును స్వాధీనం చేసుకున్న దర్యాప్తు అధికారులు.. ఆమెపై విచారణ చేపట్టారు.

## విద్యారంగానికి పునాదులు వేసిన మౌలానా
## ఆజాద్ జయంతి సందర్భంగా స్మరించుకున్న రేవంత్

భారత దేశ తొలి విద్యా శాఖ మంత్రిగా పని చేసి దేశ విద్యా రంగానికి పునాదులు వేసిన ఘనత మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కే దక్కుతుందని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. మౌలానా జయంతి సందర్భంగా విద్యారంగ ప్రగతికి ఆయన చేసిన సేవలను ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. మహనీయుడి జయంతి రోజునే నవంబరు 11న జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించుకుంటున్నామని చెప్పారు. సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ చైర్మన్‌గా, వయోజన అక్షరాస్యత, సార్వత్రిక ప్రాథమిక విద్య, 14 సంవత్సరాల్లోపు బాలబాలికలందరికీ నిర్బంధ ఉచిత విద్య, వృత్తి శిక్షణలతో పాటు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఏర్పాటు వంటి విభిన్న విధానాలతో దేశంలో విద్యారంగాభివృద్ధికి ఆజాద్ ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. మౌలానా ఆజాద్ స్ఫూర్తితో విద్యా
రంగంలో రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. అందులో భాగంగానే గ్రామీణ, నిరుపేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో నాణ్యమైన ఉచిత విద్య అందించేందుకు ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నట్లు వివరించారు. ఐటీఐలను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా అప్ గ్రేడ్ చేశామని తెలిపారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుతో పాటు ఉపాధ్యాయులు, లెకర్చర్ల నియామకంతో రాష్ట్రంలో విద్యాభివృద్ధికి పాటుపడుతున్నామని పేర్కొన్నారు. జాతీయోద్యమంలో పాల్గొనడంతో పాటు అఖిల భారత కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షునిగా ఆజాద్ ఎనలేని సేవలు అందించారని సీఎం కొనియాడారు. ఖిలాఫత్ ఉద్యమములో పాల్గొని బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకముగా పోరాడారని గుర్తు చేశారు. జాతీయోద్యమములో హిందూ ముస్లిం ఐక్యతను కోరుకొని దేశ విభజనను వ్యతిరేకించాడని తెలిపారు. స్వాతంత్యం÷-ర అనంతరం మైనారిటీలకు గొంతుకగా నిలిచారని పేర్కొన్నారు.

## ఓటర్ జాబితా స్పెషల్ రివిజన్ ఇదో సూపర్ ఎమర్జెన్సీ లాంటిదే

**-మరోమారు మండిపడ్డ మమతా బెనర్జీ**

ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మరోసారి విరుచుకుపడ్డారు. కేంద్రం, ఎన్నికల కమిషన్‌పై విమర్శలు
గుప్పించారు. డీమోనిటైజేషన్, ఎస్ఐఆర్ డ్రైవ్‌ను ఒకేగాట కడుతూ మొదటిది 'నోట్‌బందీ' అయితే, రెండవది 'ఓట్‌బందీ' అని అన్నారు. సిలిగురిలో సోమవారంనాడు మీడియాతో మాట్లాడుతూ సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికలకు కొద్దిరోజుల ముందు ఎస్ఐఆర్ డ్రైవ్ చేపట్టాల్సిన అవసరం ఏముందని మమతా బెనర్జీ ప్రశ్నించారు. ఈ చర్యను సూపర్ ఎమర్జెన్సీతో ఆమె పోల్చారు. ఎస్ఐఆర్ పక్రియను ఉపసంహరించుకోవాల్సిందిగా ఈసీని కోరారు. ఎస్ఐఆర్‌ను విమర్శించినందుకు బీజేపీ తనను జైలుకు పంపినా, గొంతు కోసినా ప్రజల ఓటు హక్కులను మాత్రం ఊడలాక్కోలేరని అన్నారు. ఎస్ఐఆర్ పేరుతో ప్రజలను బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం వేధిస్తోంది. నోట్లరద్దు ఎలాటిందో ఓట్‌బందీ కూడా అలాంటిదే. ఎన్నికలకు ముందు ఇంత హడావిడిగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎందుకో నాకు అర్థం కావడం లేదు. ఈసీ తక్షణం ఈ పక్రియను ఆపేయాలి. ఓటర్ల జాబితా రివిజన్ అనేది రెండు మూడు నెలల్లో పూర్తయ్యేది కాదు, బలవంతంగా దీన్ని నిర్వహిస్తున్నారు' అని మమత ఆక్షేపణ తెలిపారు. తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో గత వారంలో ఎస్ఐఆర్ డ్రైవ్ మొదలైంది. డిసెంబర్ 9 నాటికి ముసాయిదా ఎన్నికల జాబితాను విడుదల చేస్తామని, ఫిబ్రవరి 7న తుది జాబితాను పబ్లిష్ చేస్తామని ఎన్నికల సంఘం తెలిపింది. రెండో విడత ఎస్ఐఆర్ పక్రియ నిర్వహిస్తున్న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో అండమాన్ నికోబార్ ఐలాండ్స్, లక్షద్వీప్, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, పుదుచ్చేరి, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్ ఉన్నాయి. తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, పశ్చిమబెంగాల్‌లో 2026లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉన్నాయి. అదే ఏడాది ఎన్నికలు జరగాల్సిన రాష్టాల్లో్ర అసోం కూడా ఉంది.

## ఢిల్లీ పేలుళ్ల ఘటనతో అలర్ట్
### - హైదరాబాద్‌లో హైలర్ట్ ప్రకటించిన పోలీసులు

ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడుతో దేశ రాజధాని దిల్లీలో అలజడి రేగింది. ఎర్రకోట మెట్రోస్టేషన్ గేట్ నంబర్ 1 వద్ద కారులో పేలుడు సంభవించి.. 8 మంది మృతి చెందగా పలువురికి గాయాలయ్యాయి. ఎర్రకోట పరిసర ప్రాంతాల్లో భీతావహ వాతావరణం నెలకొంది. దీంతో ఆ ప్రాంతంలో హై అలర్ట్ ప్రకటించారు. ఎన్ఐఏ బృందాలు రంగంలోకి దిగాయి. ఈ నేపథ్యంలో దిల్లీ సహా పలు నగరాలను కేంద్ర హోం శాఖ అప్రమత్తం చేసింది. ముంబయి, హైదరాబాద్, కోల్‌కతా, బెంగళూరు తదితర నగరాల్లో హైఅలర్ట్ ప్రకటించింది. తాజా పరిస్థితుల నేపథ్యంలో హైదరాబాద్ పోలీసులు, ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. ముమ్మర తనిఖీలు సాగిస్తున్నారు. దిల్లీ పేలుళ్ల దృష్ట్యా నగరంలో అలర్ట్ ప్రకటించినట్లు హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. పలుచోట్ల తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

## మాయమైన మనిషి అందెశ్రీ

మొదటిపేజీ తరువాయి
ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో జయ జయహే తెలంగాణ గేయం కోట్లాది ప్రజల గొంతుకై నిలిచిందన్నారు. అందెశ్రీతో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా సీఎం గుర్తుచేసుకున్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర గీతం కొత్త స్వరాలతో రూపకల్పన చేసుకున్నామన్నారు. తెలంగాణ సాహితీ శిఖరం నేలకూలిందంటూ సీఎం సంతాపం వ్యక్తం చేశారు. కవి,రచయిత అందెశ్రీ మృతి పట్ల ఏపీ సీఎం చంద్రబాబు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణ వార్త దిగ్భ్రాంతిని కలిగించిందని అన్నారు. తెలుగు సాహితీ లోకానికి ఇది తీరని లోటు అని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. అందెశ్రీ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.
అందెశ్రీ మృతి పట్ల స్పీకర్ ప్రసాద్ కుమార్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబు సంతాపం వ్యక్తం చేశారు. అందెశ్రీ మృతి పట్ల భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ దిగ్భ్రాంతితి వ్యక్తం చేశారు. రాష్ట్ర సాధన సాంస్కృతిక ఉద్యమంలో అందెశ్రీ పాల్గొన్నారని గుర్తుచేశారు. తన పాటలతో తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. ఆయన మరణం రాష్ట్రానికి తీరని లోటు అని పేర్కొన్నారు. అందెశ్రీ మృతిపట్ల భారత రాష్ట్ర సమితి నేతలు కేటీఆర్, హరీశ్‌రావు సంతాపం వ్యక్తం చేశారు. అందెశ్రీకి పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు జరపాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈమేరకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

## ఎర్రకోట వద్ద పేలుడు ఘటన ఆరా తీసిని ప్రధాని మోడీ

ఎర్రకోట సమీపంలో చోటుచేసుకున్న పేలుడు ఘటనపై ప్రధాని మోదీ ఆరా తీశారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. మరోవైపు, ఈ పేలుడు ఘటనకు సంబంధించిన వివరాలను దిల్లీ పోలీస్ కమిషనర్ వెల్లడించారు. సాయంత్రం 6.52 గంటలకు ఓ వాహనం ఎర్రకోట సమీపంలోని రెడ్ సిగ్నల్ వద్ద వచ్చి ఆగిందని, ఆ వెంటనే పేలుడు సంభవించిందని తెలిపారు. పేలుడు ధాటికి పలు వాహనాలకు మంటలు అంటుకున్నట్లు పేర్కొన్నారు. ఈ ఘటనలో పలువురు మృతి చెందగా.. మరికొంత మంది గాయపడినట్లు చెప్పారు. దేశ రాజధాని నగరం దిల్లీలో ఎర్రకోట సమీపంలోని ఓ కారులో జరిగిన పేలుడు ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన దిల్లీ పోలీస్ కమిషనర్‌తో మాట్లాడారు. పేలుడు ఘటన వివరాలను అమిత్ షాకు కమిషనర్ వివరించారు. మరోవైపు, ఈ ఘటనకు సంబంధించి ఎప్పటికప్పుడు ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్‌ను హోంమంత్రి ఆరా తీస్తున్నారు. మరోవైపు, ఈ ఘటన తీవ్ర బాధాకరమని కాంగ్రెస్ పేర్కొంది. దీనిపై సమగ్రమైన, వేగవంతమైన దర్యాప్తు చేయాలని డిమాండ్ చేసింది. మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేడా సంతాపం తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. మరోవైపు, ఈ దుర్ఘటనపై దిల్లీ మాజీ సీఎం, ఆప్ అధినేత అర్వింద్ కేజీవ్రాల్ స్పందించారు. పేలుడు జరిగి కొందరు మృతిచెందినట్లు వస్తున్న వార్తలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ఇది చాలా బాధాకరమంటూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. ఈ పేలుడు ఎలా జరిగిందో, దీని వెనుక ఏదైనా కుట్ర ఉందా అనేదానిపై పోలీసులు, ప్రభుత్వం వెంటనే దర్యాప్తు చేయాలని కోరారు.

## సిగ్నల్ వద్ద కారు ఆగీ..ఆగగానే పేలుడు

**దిల్లీ నగర పోలీస్ కమిషనర్ వెల్లడి**

ఎర్రకోట మెట్రోస్టేషన్ సమీపంలో జరిగిన పేలుడు ఘటనపై దిల్లీ నగర పోలీస్ కమిషనర్ కీలక వివరాలను వెల్లడించారు. సాయంత్రం 6.52గంటల సమయంలో ఈ పేలుడు జరిగినట్లు వెల్లడించారు. ఎర్రకోట సమీపంలో నిదానంగా వచ్చి రెడ్‌లైట్ వద్ద కారు ఆగిందని, ఆగి ఆగుతుండగానే ఒక్కసారిగా పేలుడు జరిగిందని వివరించారు. ఈ పేలుడు ధాటికి సమీపంలోని వాహనాలు ధ్వంసమయ్యాయన్నారు. ఈ ఘటనలో పలువురు మృతి చెందగా.. మరికొంత మంది గాయపడినట్లు సీపీ చెప్పారు. మరోవైపు, పేలుడు ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన దిల్లీ పోలీస్ కమిషనర్‌తో మాట్లాడారు. పేలుడు ఘటన వివరాలను అమిత్ షాకు కమిషనర్ వివరించారు. ఈ ఘటనకు సంబంధించి ఎప్పటికప్పుడు ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్‌ను హోంమంత్రి ఆరా తీస్తున్నారు. కారు పేలుడు ఘటన అత్యంత హృదయ విదారమైనదని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. ఈ ఘటనను తనను తీవ్ర ఆందోళన గురిచేసిందన్నారు. ఈ ఘటనలో చాలా మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారన్న వార్తలు తీవ్ర బాధాకరమని 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఈ దుఃఖ సమయంలో మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారంతా త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు ఈ ఘటనపై సమగ్రమైన, వేగవంతమైన దర్యాప్తు చేయాలని కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేడా డిమాండ్ చేశారు. మరోవైపు, ఈ దుర్ఘటనపై దిల్లీ మాజీ సీఎం, ఆప్ అధినేత అర్వింద్ కేజీవ్రాల్ స్పందించారు. పేలుడు జరిగి కొందరు మృతిచెందినట్లు వస్తున్న వార్తలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ఇది చాలా బాధాకరమంటూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. ఈ పేలుడు ఎలా జరిగిందో, దీని వెనుక ఏదైనా కుట్ర ఉందా అనేదానిపై పోలీసులు, ప్రభుత్వం వెంటనే దర్యాప్తు చేయాలని కోరారు.

## మరోమారు పెరిగిన బంగారం ధరలు

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1, 23, 220కి చేరింది. గతంతో పోల్చుకుంటే దాదాపు రూ.1200 పెరిగింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 1, 11, 950కి చేరింది. నిన్నటితో పోల్చుకుంటే దాదాపు రూ.1100 పెరిగింది.ఇటీవల ధర బాగా తగ్గడంతో కొనుగోళ్లు పెరగడమే ఈ పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. ఇక, ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 23, 370కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 1, 13, 100కి చేరుకుంది.ఇక వెండి ధరల్లో కూడా భారీ పెరుగుదల నమోదైంది. కేజీకి 2,500 రూపాయల మేర వెండి ధర పెరిగింది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ. 1, 67, 000గా ఉంది. ఇక, ఢిల్లీలో కిలో వెండి ధర రూ.1, 55, 000గా ఉంది. పైన పేర్కొన్న బంగారం, వెండి రేట్లు ఎప్పటికప్పుడూ మారుతుంటాయి. కాబట్టి వీటిని కొనుగోలు చేసే సమయంలో మళ్లీ ధరలు
మిక్షించుకోవాల్సి ఉంటుంది.

## అత్యాధునికంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్

మొదటిపేజీ తరువాయి
ఈ స్టేషన్‌లో 26 లిఫ్టులు, 32 ఎస్కలేటర్లు ఉంటాయి. రైల్వేస్టేషన్ కోసమే ప్రత్యేకంగా 2 సబ్‌స్టేషన్ల నిర్మాణం జరుగుతోందని కిషన్ రెడ్డి తెలిపారు. 5 మెగావాట్ల సౌరవిద్యుత్ ప్లాంటు కూడా ఏర్పాటు చేస్తున్నాం. వచ్చే ఏడాది డిసెంబర్‌లోపు ప్రధాని మోదీ చేతుల మీదుగా ఆధునిక సికింద్రాబాద్ స్టేషన్‌ను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నాంఅని కిషన్‌రెడ్డి తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా పునర్నిర్మిస్తున్నట్లు కిషన్ రెడ్డి ప్రకటించారు. దక్షిణ భారత దేశంలోనే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని ఆయన పేర్కొంటూ.. అమృత్ భారత్ పథకం కింద రూ. 714 కోట్లతో ఈ స్టేషన్‌ను ఆధునీకరిస్తున్నామని, ఇప్పటికే 50 శాతం పనులు పూర్తయ్యాయని ఆయన తెలిపారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం 1,97,000 మంది ప్రయాణికులు రోజువారీగా ఈ స్టేషన్‌కు వస్తున్నారని, ప్రతి గంటకు సుమారు 23 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ.. పనుల వేగం తగ్గకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. నూతన నిర్మాణాలలో భాగంగా సౌత్ మెయిన్ బిల్డింగ్, మల్టీ లెవెల్ కార్ పార్కింగ్, ట్రావెలర్ తో కూడిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయని ఆయన వెల్లడించారు. సౌత్ సైడ్ బ్లాక్ నిర్మాణం రాబోయే నాలుగు నెలల్లో పూర్తి అవుతుందని, మొత్తం పునర్నిర్మాణ పనులను 13 నెలల్లో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామని కిషన్ రెడ్డి తెలిపారు. ఈ స్టేషన్‌ను 3 ఎకరాల విస్తీర్ణంలో 3 వేల మంది కూర్చునే విధంగా నిర్మిస్తున్నామని.. ఇది శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ మాదిరిగా అత్యాధునికంగా ఉండనుందని ఆయన పేర్కొన్నారు. నవీకరించబడిన స్టేషన్‌లో 26 లిఫ్టలు, 32 ఎస్కలేటర్లు అందుబాటులోకి రానున్నాయి. అంతేకాకుండా, రెండు సబ్ స్టేషన్లు, అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ సిస్టమ్, 5 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఎ÷-లాంట్, 5 లక్షల లీటర్ల సీవేజ్ ట్రీట్‌మెంట్ ఎ÷-లాంట్ వంటి సదుపాయాలు ఉండనున్నాయి. రోజుకు 2,70,000 మంది ప్రయాణికులు వచ్చినా సేవలు అందించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వివరించారు.

## కాంగ్రెస్ మద్యం, డబ్బులు విచ్చలవిడిగా పంపిణీ చేస్తోంది: హరీశ్‌రావు

మొదటిపేజీ తరువాయి
అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఈసీని కోరినట్లు చెప్పారు. సీ విజిల్ యాప్‌లోనూ ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఫిర్యాదు చేసినా కొందరు పోలీసులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు."అధికార పార్టీ ఎన్ని ప్రయత్నాలు చేసినా.. జూబ్లీహిల్స్ ఓటర్లు తగిన రీతిలో బుద్ధి చెబుతారు. ఇంత అధికార దుర్వినియోగం జరుగుతున్నా ఎన్నికల అధికారులు పట్టించుకోవడం లేదు. అన్ని విషయాలను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకొచ్చాం. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో కేంద్ర బలగాలను పెట్టాలని కోరుతూ.. ఆయా బూత్‌ల వివరాలను సమర్పించాం. ముఖ్యంగా మహిళా పోలీస్ అధికారులు, ఆశా, అంగన్వాడీ వర్కర్లను ఆయా చోట్ల నియమించాలని కోరాం. మహిళా ఓటర్ల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలి. నకిలీ ఓటర్ కార్డులు తయారు చేశారు. ఆ వీడియోను ప్రధాన ఎన్నికల అధికారికి సమర్పించాం. కచ్చితంగా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రికి గత రెండేళ్లుగా ఆరు గ్యారంటీలపై సమీక్ష నిర్వహించేందుకు సమయం దొరకలేదు. ఈ రోజు 6 గ్యారంటీలపై రివ్యూ పెట్టడం ఎందుకు? జూబ్లీహిల్స్‌లో ఓటమి భయంతోనే ముఖ్యమంత్రి మోకాళ్లపై తిరుగుతున్నారు. ఇవాళ 6 గ్యారంటీలపై సమీక్ష నిర్వహించడం జూబ్లీహిల్స్ ఓటర్లను ప్రభావితం చేయడమే. కాంగ్రెస్ దివాలాకోరు రాజకీయాలు ప్రజలకు అర్థమయ్యాయి. రేవంత్‌రెడ్డి ఎన్ని డ్రామాలు ఆడినా జూబ్లీహిల్స్ ఓటర్లు ఎవరికి ఓటు వేయాలో ముందే నిర్ణయించుకున్నారు" అని హరీశ్‌రావు అన్నారు.

## ఎమ్మెల్యేల ఫిరాయింపు వ్యవహారం

మొదటిపేజీ తరువాయి
ఈ పిటిషన్‌ను త్వరగా విచారణకు స్వీకరించాలని అభ్యర్థించింది. ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై జూలై 31న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయాన్ని బీఆర్ఎస్ తన పిటిషన్‌లో గుర్తుచేసింది. అక్టోబర్ 31వ తేదీ లోపు ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌ను ఆదేశించిందని తెలిపింది. అత్యున్నత స్థానం ఇచ్చిన గడువు ముగిసినప్పటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని పిటిషన్‌లో పేర్కొంది. దీంతో ఇంకా ఫిరాయింపు నేతలు ఎమ్మెల్యేలుగానే కొనసాగుతున్నారని చెప్పింది. అందుకే మరోసారి అత్యున్నత స్థానాన్ని ఆశ్రయించాల్సి వచ్చిందని చెప్పింది. ఈ విషయంలో ప్రొసీడింగ్స్ ఆలస్యం చేస్తే.. వ్యతిరేకంగా నిర్ణయం తీసుకోవచ్చని సుప్రీంకోర్టు గతంలోనే చెప్పిందని బీఆర్ఎస్ తెలిపింది. ఇంకా ప్రొసీడింగ్స్ ఎవిడెన్స్ స్టేజిలోనే ఉన్నాయని బీఆర్ఎస్ పార్టీ తరఫు న్యాయవాదులు తెలిపారు. చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయి రిటైర్ అయ్యేంతవరకు ఈ పక్రియను సాగదీయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ వాదనలు విన్న సీజేఐ.. నవంబర్ 24తో సుప్రీంకోర్టు ముగిసినట్లు కాదని స్పష్టం చేశారు. వచ్చే సోమవారం ఈ కేసు విచారణ జరుపుతామని తెలిపారు.

## ఢిల్లీ ఎర్రకోట వద్ద భారీ పేలుడు

మొదటిపేజీ తరువాయి
క్షతగాత్రులను స్థానిక ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతుల సంఖ్య పెరిగే ప్రమాదం ఉంది. పేలుడు ధాటికి మృతదేహాలు ఛిద్రమయ్యాయి. సోమవారం సాయంత్రం 6.55 గంటలకు పేలుడు సమాచారం అందినట్లు అగ్నిమాపక శాఖ ప్రకటించింది. ప్రమాదం అనంతరం ఏడు అగ్నిమాపక వాహనాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. పేలుడు నేపథ్యంలో దిల్లీలో పోలీసులు హైఅలర్ట్ ప్రకటించారు. దిల్లీ పోలీసు విభాగానికి చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం సహా క్లూస్ టీమ్ ఘటనా స్థలికి చేరుకున్నాయి. ప్రమాదం అనంతరం స్థానికంగా భీతావహ వాతావరణం నెలకొంది. పేలుడు ధాటికి చుట్టుపక్కనే ఉన్న పలు కార్లు, ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. కారులో ఉంచిన పేలుడు పదార్థాలను దూరం నుంచి ఎవరైనా రిమోట్ కంట్రోల్ సాయంతో పేల్చి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, ప్రతి సోమవారం దిల్లీలోని పర్యాటక ప్రదేశాలు, మార్కెట్లకు సెలవు కావడంతో ప్రమాదం తీవ్రత తక్కువగా ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ పేలుడు జరిగినప్పుడు నేను గురుద్వారా వద్ద ఉన్నాను. భారీ శబ్దం వినిపించింది. అదేంటో మాకు అర్థంకాలేదు. అంత పెద్దగా వినిపించింది. ఆ వాహనానికి సమీపంలో ఉన్న మరికొన్ని వాహనాలూ పూర్తిగా దగ్ధమయ్యాయఅని ఓ ప్రత్యక్ష సాక్షి వెల్లడించారు. పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. 7 ఫైరిరజన్ల సహాయంతో మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు. ఢిల్లీ స్పెషల్ పోలీస్ ఫోర్స్ కూడా ఘటనా స్థలికి చేరుకుంది. పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. దిల్లీ పోలీసు విభాగానికి చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం సంఘటనా స్థలానికి చేరుకుంది.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
మంగళవారం నవంబర్ 11 2025

# బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్లో చేర్పించాల్సిందే..

- తెలంగాణ ఉద్యమ తరహాలో, బీసీ రిజర్వేషన్ల ఉద్యమం
- బీసీ రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ జరగాల్సిందే
- పార్టీలకతీతంగా రాజకీయ నాయకులు బీసీ రిజర్వేషన్ల ఉద్యమంలో పాల్గొనాలి
- వరంగల్ ఉమ్మడి జిల్లా బీసీ జేఏసీ చైర్మన్, వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్





**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో, నవంబర్ 10**
ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి పురుడు పోసుకున్న కాకతీయ యూనివర్సిటీ గడ్డ మీద మళ్లీ బీసీ రిజర్వేషన్ల ఉద్యమానికి శ్రీకారం చుట్టిందని, రాష్ట్ర ప్రభుత్వం విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల కోటాలో 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా తీర్మానం చేసిన బీసీ రిజర్వేషన్ల బిల్లును కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్లో చేర్పించి, బీసీలకు సత్వర న్యాయం చేయాలని, మేమేంతో మాకంతా వాటా అంటూ ధర్మంగా పోరాడుతున్న బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలంటే కేంద్ర ప్రభుత్వం వెంటనే రాజ్యాంగ సవరణ చేయాలని బీసీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం కాకతీయ యూనివర్సిటీలోని ఎస్డీఎల్సీ ప్రాంగణంలో బీసీ విద్యార్థి జేఏసీ కాకతీయ యూనివర్సిటీ చైర్మన్ ఆరేగంటి నాగరాజు గౌడ్ నేతృత్వంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలని డిమాండ్ చేస్తూ, బీసీ విద్యార్థులు ధర్మదీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి బీసీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ ధర్మదీక్షను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం సిద్ధించినప్పటి నుండి అన్ని రంగాల్లో వెనుకబడిన బీసీ కులస్తులకు రిజర్వేషన్లు లేని కారణంగా బీసీలు అన్ని రంగాల్లో వెనుకబడి, అగ్రవర్ణ రాజకీయ పార్టీల జెండాలు మోసే కార్యకర్తలు గాను, ఓట్లు వేసే యంత్రాలుగాను మిగిలిపోయారన్నారు. దేశంలో అన్ని వర్గాల వారికి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఉంటే, కేవలం బీసీలకు మాత్రం రిజర్వేషన్లు లేని కారణంగా రాజకీయంగా, ఆర్థికంగా అణచివేతకు గురిచేయబడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీ విద్యార్థులు చేస్తున్న ధర్మదీక్షతోనైనా కేంద్ర ప్రభుత్వం బీసీలకు రాజ్యాంగపరంగా రిజర్వేషన్లను కల్పించేందుకు ముందుకు రావాలని, లేనియెడల ఉద్యమాన్ని గ్రామస్థాయి నుండి పటిష్టం చేసి, గల్లీ నుండి ఢిల్లీ వరకు పోరుబాట పట్టి కేంద్ర ప్రభుత్వం మెడలు వంచుతామని హెచ్చరించారు. కేయూ పాలకమండలి సభ్యులు, బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డా. చిర్ర రాజు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం పంతానికి పోయి రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించిన బిల్లును అడ్డుకొని బీసీలకు అన్యాయం చేయొద్దని, బీసీ రిజర్వేషన్లను కల్పిస్తే రాష్ట్ర ప్రభుత్వానికి పేరు వస్తుందని, బిజెపి ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటుందని ఆయన ఆరోపించారు. అగ్రవర్ణ రాజకీయ పార్టీలలోని నాయకులంతా పార్టీలకతీతంగా బీసీ ఉద్యమంలో కలిసి రాకపోతే వారికి రాజకీయ భవిష్యత్తు ఉండదని హెచ్చరించారు. కొందరు అగ్రవర్ణ పార్టీలకు తలొగ్గిన నేతలు బీసీ ఉద్యమాన్ని నీరు కార్చేందుకు కుట్రలు చేస్తున్నారని, వారిని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా బీసీ విద్యార్థులు రిజర్వేషన్లను సాధించేందుకు పోరుబాట పట్టారని, వారి పోరాటం ఉగ్రరూపం దాల్చకముందే కేంద్ర ప్రభుత్వం వెంటనే దిగివచ్చి బీసీలకు జనాభా దామాషా ప్రకారం చట్టసభలలో రిజర్వేషన్లను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్మదీక్షను తెలుగు డిపార్ట్మెంట్ హెచ్ ఓ డి మామిడి లింగయ్య నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఉమ్మడి బీసీ జేఏసీ వైస్ చైర్మన్లు బోనగాని యాదగిరి గౌడ్, దాడి మల్లయ్య యాదవ్, దొడ్డపల్లి రఘుపతి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బచ్చు ఆనందం, రాష్ట్ర కార్యదర్శి భీమగాని యాదగిరి గౌడ్, బీసీ నాయకులు బక్కి అవినాష్, ప్రొఫెసర్లు మంద సారంగపాణి, శ్రీనివాసరావు, ఆకుతోట శ్రీనివాస్, సంఘాని మల్లేశ్వర్, కృష్ణ యాదవ్, సంకినేని వెంకన్న, రమేష్, బీసీ విద్యార్థి నాయకులు సుమన్, అజయ్, గణేష్, రాజశేఖర్, రాజ్ కుమార్, నితిన్, సంజీవ్, రాజేష్, అనిల్, వినోద్, సాయి కృష్ణ, మహేష్, నాగరాజ్ యాదవ్, నాగరాజు పటేల్, చిర్ర సుమన్, వేముల మహేందర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు అభివృద్ధికి దోహదపడే ఆవిష్కరణలు చేయాలి

» నిట్ డైరెక్టర్ ప్రొ.బిద్యాధర్ సుబుధి



**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో, నవంబర్ 10**
విద్యార్థులు నిరంతరం సామాజిక అభివృద్ధికి దోహదపడే ఆవిష్కరణలు చేయాలని నిట్ డైరెక్టర్ ప్రొ.బిద్యాధర్ సుబుధి అన్నారు. సోమవారం ప్రపంచ సైన్స్ దినోత్సవ వేడుకలు పురస్కరించుకొని నిట్ లో అక్సెసెబుల్ అనలిటికల్ టెక్నాలజీపై అవగాహన సదస్సును నిర్వహించారు. సదస్సును ప్రారంభించిన సుబుధి మాట్లాడుతూ.. నాణ్యమైన పరిశోధనలు, ఆవిష్కరణల దిశగా ఇంజినీరింగ్ విద్యార్థులు నిరంతరం పయనించాలన్నారు. యువత సామజిక బాధ్యతగా తీసుకొని సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు చేయాలన్నారు.

# జాగృతి అధ్యక్షురాలు కవిత వరంగల్ పర్యటన విజయవంతం



» కల్వకుంట్ల కవిత వరంగల్ పర్యటన విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేసిన తెలంగాణ జాగృతి హన్మకొండ జిల్లా అధ్యక్షులు డాక్టర్ పర్లపల్లి శ్రీశైలం

**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో, నవంబర్ 10**
జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నిర్వహించిన జాగృతి జనం బాట(వరంగల్) కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజానీకానికి, వివిధ వర్గాల ప్రజలకు, మేధావులకు, విద్యావంతులకు, కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్స్, విద్యార్థి సంఘాల నాయకులకు, ఉద్యోగస్తులకు, నిరుద్యోగులకు, కుల సంఘాల నాయకులకు, సబండ ప్రజానీకానికి, ప్రతి ఒక్కరికి, జాగృతి జనం బాటలో కదిలిన ప్రతి ఒక్క వ్యక్తికి, తెలంగాణ జాగృతి హన్మకొండ జిల్లా అధ్యక్షులు డాక్టర్ పర్లపల్లి శ్రీశైలం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలియజేశారు. కల్వకుంట్ల కవిత అనేక సమస్యల పైన ఈ రెండు రోజులు ఉమ్మడి వరంగల్ జిల్లాలో తిరుగుతూ.. ఆ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వానికి విన్నవించడం జరిగింది. అదే విధంగా జాగృతి జనం బాట కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఉమ్మడి వరంగల్ జిల్లా జాగృతి నాయకులకు,జాగృతి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రూప్ సింగ్ నాయక్ కి, అధికార ప్రతినిధి డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్ కి, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షులు మారుపల్లి మాధవికి, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలంగాణ డాక్టర్ పర్లపల్లి శ్రీశైలం తెలిపారు.

# రాజీ మార్గమే..రాజమార్గం

» 15న నేషనల్ లోక్ అదాలత్
» మొగుళ్ళపల్లి ఎస్ఐ బోరగాల అశోక్ పిలుపు



**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో, నవంబర్ 10**
రాజీమార్గమే రాజమార్గమని, సమాజ శ్రేయస్సుకై సత్యర న్యాయం జరగాలంటే ఈనెల 15న జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టులో నిర్వహించబోయే నేషనల్ లోక్ అదాలత్ ను మొగుళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కేసులకు సంబంధించిన వ్యక్తులు సద్వినియోగం చేసుకోవాలని మొగుళ్లపల్లి ఎస్ఐ బోరగాల అశోక్ పిలుపునిచ్చారు. సోమవారం తన చాంబర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్ అదాలత్ లో న్యాయ శాస్త్ర కోవిదులు, అధికార, అనధికార ప్రముఖుల సమక్షంలో.. స్నేహపూరితమైన వాతావరణంలో.. ఉభయ పక్షాలకు ఆమోదయోగ్య మైన తీర్పు ద్వారా మీకు ఉండబడినటువంటి కేసులలో తుది పరిష్కారం పొందవచ్చున్నారు. వ్యయ ప్రయాసాలు లేని సత్వర న్యాయం పొందాలంటే లోక్ అదాలత్ వ్యవస్థను వినియోగించుకోవాలన్నారు చిరకాలంగా కోర్టులందు అపరిష్కృతంగా నిలిచిపోయిన కేసులను తక్కువ వ్యవధిలో..ఖర్చు లేకుండా లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించు కోవచ్చున్నారు. భార్యాభర్తల మధ్య గల వివాహ సంబంధమైన వివాదములు, మనోవర్తి, విడాకులు, అత్తింటి వారి ఆరాళ్ళ పిల్లల మనోవర్తి, అన్ని రకాల సివిల్ కేసులు, భూ వివాదాలు, చట్టరీత్యా రాజికీ ఆమోదయోగ్యమైన అన్ని రకాల క్రిమినల్ కేసులు మరియు చెక్ బౌన్స్ మొదలైన కేసులను లోక్ అదాల ద్వారా.. శాశ్వతమైన, అంగీకార యోగ్యమైన, సత్వర పరిష్కార మార్గాలను పొందవచ్చున్నారు. పలుమార్లు కోర్టుల చుట్టూ తిరగవలసిన పని లేకుండా సహృద్భావ వాతావరణంలో..అప్పీలు లేని, న్యాయబద్ధమైన అంతిమ తీర్పు పొందాలంటే..లోక్ అదాలత్ లను వినియోగించుకోవాలన్నారు. కలహించుకునే కక్షిదారులు..కదిలి వచ్చి..కలిసి పోవాలన్నారు. మొగుళ్లపల్లి మండలంలో ఎవరివైనా కేసులు కోర్టులో పెండింగ్ లో ఉంటే ఎస్ఐ బోరగాల అశోక్ ఫోన్ నెంబర్ 8712658126, కోర్టు కానిస్టేబుల్ సుమలత ఫోన్ నెంబర్ 9603396097, పోలీస్ స్టేషన్ ఫోన్ నెంబర్ 8712658147ల ద్వారా సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

# బాధితునికి చరవాణిని అందజేస్తున్న ఎస్ఐ బోరగాల అశోక్



**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో, నవంబర్ 10**
రెండు నెలల క్రితం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్ళపల్లి మండలంలోని మెట్టుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు యార రవికుమార్ తన చరవాణిని పోగొట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో ఆన్ లైన్ లో ఫిర్యాదు చేసి, మొగుళ్ళపల్లి పోలీసులను సంప్రదించాడు. కాగా ఎస్ఐ బోరగాల అశోక్ ఆదేశాల మేరకు సీఈఐఆర్ పోర్టల్ ఆపరేటర్ జ్యోతి చరవాణి యొక్క ఐఎంఈఐ నెంబర్ సహాయంతో ట్రేస్ చేసి చరవాణిని కనుగొన్నారు. సోమవారం చరవాణిని పోగొట్టుకున్న కాంగ్రెస్ నాయకుడు యార రవికుమార్ కు మొగుళ్ళపల్లి ఎస్ఐ బోరగాల అశోక్ పోలీస్ స్టేషన్ కు పిలిపించి.. చరవాణిని తనకు అప్పగించారు. చాక చక్యంతో ట్రేస్ చేసి చరవాణిని కనుగొన్న సీఈఐఆర్ పోర్టల్ ఆపరేటర్ జ్యోతిని ఈ సందర్భంగా ఎస్ఐ బోరగాల అశోక్ అభినందించారు.

# అందెశ్రీకి హనుమకొండ బార్ అసోసియేషన్ ఘనంగా నివాళి

» అందెశ్రీ మరణం తెలంగాణకు తీరని లోటు




**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో, నవంబర్ 10**
మానవీయ విలువల సమాజ నిర్మాణంతో పాటు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన పద్మశ్రీ డాక్టర్ అందెశ్రీ మరణం తెలంగాణతో పాటు దేశంలోని పీడిత ప్రజలకు తీరని లోటని హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు పులి సత్యనారాయణ అన్నారు. అందెశ్రీ అకాల మరణంతో సోమవారం హనుమకొండ, వరంగల్ జిల్లా కోర్టుల విధులు బహిష్కరించి సర్దార్ వల్లభాయి పటేల్ హాల్ లో హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు పులి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన నివాళి సభలో అందెశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి, రెండు నిముషాలు మౌనం వహించి నివాళులు అర్పించి మాట్లాడారు. కనీస అక్షర జ్ఞానం లేకున్నప్పటికీ ప్రజల సమస్యలపై నిత్యం స్పందిస్తూ సామాజిక స్పృహతో పీడిత ప్రజల కష్టాలపై, పాలకుల దోపిడీపై, తెలంగాణ అణచివేతపై ఎన్నో ఉత్తేజపూరిత పాటలు వ్రాసి, పాడిన మహా కవి అందెశ్రీ బాటలో తెలంగాణ సమాజం పయనించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు దుస్సా జనార్ధన్, బైరపాక జయాకర్, మాజీ బార్ కౌన్సిల్ సభ్యులు ముద్దసాని సహోదర రెడ్డి, హనుమకొండ బార్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి కొత్త రవి, ఉపాధ్యక్షులు మైదం జయపాల్, ఐ ఎల్ పి ఎ రాష్ట్ర నాయకులు సాయిని నరేందర్, సీనియర్ న్యాయవాదులు చిల్ల రాజేంద్రప్రసాద్, గుడిమల్ల రవి, తీగల జీవన్ గౌడ్, నబి, సత్యపాల్, నల్ల మహాత్మా, బత్తిని రమేష్ గౌడ్, గంధం శివ, వేముల రమేష్ లు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన ఆయన మాట, పాట తూటాల్లాగా పని చేశాయని, అందెశ్రీ రచించి పాడిన జయజయహే తెలంగాణ జననీ జయకేతనం గీతం తెలంగాణ రాష్ట్ర గీతంగా కొనసాగడం అందెశ్రీకి గర్వకారణమని, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎంత తపించి పాడాడో అంతకన్నా ఎక్కువగా తెలంగాణలో కెసిఆర్ దుష్ట పాలన అంతం కోసం శ్రమించాడని వారన్నారు. మాయమై పోతున్నడమ్మా మనిషన్న వాడు అని పాడి మానవీయ విలువల సమాజ నిర్మాణం కోసం నిరంతరం పోరాటం చేశాడని అన్నారు. అందెశ్రీ లాంటి మహనీయుల పోరాటం, త్యాగాల వల్ల ఏర్పడిన తెలంగాణలో లబ్ధి పొందుతున్న వారు తెలంగాణ సమాజ అభివృద్ధికి కోసం పాటుపడాలని, ఆయన చూపిన బాటలో పయనించడమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళని అన్నారు. నివాళి సభ అనంతరం కోర్టు హాల్ నుండి అమరవీరుల స్థూపం వరకు ర్యాలీగా వెళ్లి అమరవీరుల స్థూపం వద్ద అమర్ రహే అందెశ్రీ అని నినదించి నివాళు లు అర్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఆనంద్ మోహన్, ఇజ్జగిరి సురేష్, పశుపతి ఈశ్వర్ నాథ్, రామగోని నర్సింగరావు, యాకస్వామి, వోడపల్లి శ్యామ్ కృష్ణ, సునీల్ కుమార్, కానూరు రంజిత్ గౌడ్, కుమార్, శ్రీధర్, జి ఆర్ శ్రీనివాస్, పూసపల్లి శ్రీనివాస్, ఎగ్గడి సుందర్ రామ్, చిరంజీవి, వలిఉల్లా ఖాద్రీ, ఇజ్జగిరి చంద్రశేఖర్, తాళ్ళపెల్లి మధూకర్, తండమల్ల శ్రీనివాస్, రాహుల్, కొండయ్య, స్వర్ణలత, అంజలి, వేణు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# అందేశ్రీ మరణం పట్ల మహేందర్ గౌడ్ సంతాపం

» బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్



**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో, నవంబర్ 10**
తెలంగాణ రాష్ట్ర గీతమైన "జయ జయహే తెలంగాణ" రచయిత అందెశ్రీ ఆకస్మిక మరణం ఎంతో బాధాకరమని బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ అన్నారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆయన మరణం తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటని, మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఆయన రాసిన గీతం ప్రజలలో చైతన్యాన్ని రగిలించి, అందరినీ ఒక్కతాటి మీదకు తీసుకువచ్చిందన్నారు. ఆయన సాహితీ కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందన్నారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్ర గీతంగా "జయ జయహే తెలంగాణ" ప్రకటించిన రోజున అందెశ్రీ కళ్లలో కనిపించిన ఆనందం, ఉద్విగ్నత నేటికీ తారసపడుతోందన్నారు. సాహితీ వనంలో మహావటవృక్షం కూలిపోయినంత బాధ ఈ రోజు మనందరిదని, ఈ సందర్భంగా అందెశ్రీ కుటుంబ సభ్యులకు ఆయన తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయనకు స్వర్గలోక ప్రాప్తిరస్తు కలగాలని ఆ భగవంతుణ్ని వేడుకుంటున్నట్టు మహేందర్ గౌడ్ తెలిపారు.

# హైదరాబాదు ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ - 2025 బ్రోచర్ ఆవిష్కరణ





**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో, నవంబర్ 10**
కరాటే ఇండియా ఆర్గనైజేషన్ (కేఐఓ) న్యూ ఢిల్లీ లోని ప్రధాన కార్యాలయంలో సోమవారం హైదరాబాద్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ - 2025 బ్రోచర్ ను కేఐఓ అండ్ సీకేఎఫ్ అధ్యక్షులు, ఏకేఎఫ్ ఈసీ సభ్యులు మరియు 8వ డాన్ బ్లాక్ బెల్ట్ హన్షీ భారత్ శర్మ ఆవిష్కరించారు. డిసెంబర్ 13, 14 తేదీల్లో హైదరాబాద్, సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో ఈ పోటీలు జరగనున్నాయి. ఈ సందర్భంగా హన్షీ భారత్ శర్మ మాట్లాడుతూ...ఈ ఛాంపియన్షిప్ ను సీకోకై కరాటే తెలంగాణ సంస్థ, తెలంగాణ స్పోర్ట్స్ కరాటే డో అసోసియేషన్ తో కలిసి నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమం కరాటే ఇండియా ఆర్గనైజేషన్ అనుమతితో జరుగుతుంది. ఇది వర్ల్డ్ కరాటే ఫెడరేషన్ (డబ్ల్యూకేఎఫ్) కు అనుబంధంగా ఉంది. "హైదరాబాదు ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ యువ కరాటే క్రీడాకారులకు తమ నైపుణ్యాలను జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రదర్శించే అద్భుతమైన వేదికగా నిలుస్తుంది అన్నారు. దేశ వ్యాప్తంగా కరాటే కళ స్ఫూర్తిని మరింత పెంచడమే తమ లక్ష్యం అని తెలిపారు. మాస్టర్ టి. కనక రాజు (డబ్ల్యూకెఎఫ్ అండ్ ఏకెఎఫ్ జడ్జ్, సీకో అధికారిక ఇన్‌స్ట్రక్టర్, తెలంగాణ),
మాస్టర్ జే. ప్రవీణ్ కుమార్ (ఏకెఎఫ్ జడ్జ్ అండ్ డబ్ల్యూకెఎఫ్ కోచ్) లతో పాటు ఈ కార్యక్రమంలో టీ పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ, కరాటే ఇండియా ఆర్గనైజేషన్ ఉపాధ్యక్షులు బి. మహేష్ కుమార్ గౌడ్ , కేఐఓ జాయింట్ సెక్రటరీ కీర్తన్ కొంద్రు ముఖ్య అతిథులుగా పాల్గొంటారు.

# కరీంనగర్ జిల్లా టెన్త్ విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లించిన కేంద్ర మంత్రి బండి సంజయ్.







Date : 05-Nov-2025.

Dear Smt. Pamela Satpathy Ji,

In continuation to my D.O. letter No. MoS (Home) (BS)/ 3993856/157 dated 03.11.2025 regarding providing the details of bank account of your District for depositing the examination fees of students studying in 10th class.

2. It is to be informed that, I will be bearing the examination fees of students studying in class 10th in the four districts within my parliamentary constituency i.e. Karimnagar, Jagtial, Rajanna Siricilla and Hanumakonda from my Member of Parliament's salary account.

3. In this regard, it is requested to furnish the details of bank account in which the said amount to be deposited and also furnish the details of school wise 10th Class students details and total amount to be deposited at an early possible date.

With regards,

Yours sincerely,

(Bandi Sanjay Kumar)

Smt. Pamela Satpathy, IAS,
Collector & District Magistrate, Karimnagar,
Collectorate Complex, Karimnagar,
Telangana-505001
collector_krmn@telangana.gov.in

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ నవంబర్ 10**

జిల్లా విద్యార్థులకు తన వేతన డబ్బులు నుండి రూ.5,45, 375 ల మొత్తం చెల్లించిన బండి సంజయ్.పరీక్ష ఫీజు మొత్తానికి సంబంధించిన చెక్కును జిల్లా కలెక్టర్ కు అందజేసిన బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి.మోదీ గిఫ్ట్ పేరుతో ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ ఎగ్జామ్ ఫీజును చెల్లిస్తానని ప్రకటించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ సోమవారం రోజున కరీంనగర్ జిల్లా టెన్త్ విద్యార్థుల పరీక్ష ఫీజు రూ.5,45, 375 మొత్తాన్ని చెల్లించారు. ఈ మేరకు బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, నాయకులు గుజ్జ శ్రీనివాస్ లు జిల్లా కలెక్టర్ ను కలిసి పరీక్షా ఫీజు మొత్తానికి సంబంధించిన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుకునే విద్యార్థులందరికి ఈ ఏడాది టెన్త్ ఎగ్జామ్ ఫీజును పూర్తిగా చెల్లించేందుకు ఇటీవల కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నిర్ణయం తీసుకొని, ఆమేరకు ఆయా జిల్లాల కలెక్టర్లకు లేఖ రాశారని తెలిపారు. అధికార వర్గాలు తెలియజేసిన ప్రకారం కరీంనగర్ జిల్లాలో 4,847, మంది 10వ తరగతి విద్యార్థులున్నారనీ, వీరందరికీ పరీక్ష ఫీజు కోసం కరీంనగర్ ఎంపీ, కేంద్రమంత్రి బండి సంజయ్ తన వేతన డబ్బులు నుండి రూ.5,45, 375 ల మొత్తాన్ని చెల్లించడం జరిగిందన్నారు. బండి సంజయ్ కుమార్ అందజేసిన మొత్తాన్ని చెక్ రూపంలో జిల్లా కలెక్టర్ కు అందజేసినట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులంతా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారేనని, . వారిలో చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లల పరీక్ష ఫీజుల విషయంలో ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో బండి సంజయ్ తన నియోజకవర్గ పరిధిలోని ఆయా స్కూళ్లలో చదివే విద్యార్థుల ఫీజు మొత్తాన్ని చెల్లించేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. కరీంనగర్ జిల్లా ప్రభుత్వ పాఠశాల పదవ తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజు మొత్తాన్ని భరించి , వారికి చేయూతనిచ్చిన కేంద్రమంత్రి బండి సంజయ్ కి బిజెపి కరీంనగర్ జిల్లా పక్షాన ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా చెప్పారు.

# లైన్స్ క్లబ్ ఆఫ్ రాజరాజేశ్వరి సర్వసభ్య సమావేశం.



**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ నవంబర్ 10**

లైన్స్ క్లబ్ ఆఫ్ రాజరాజేశ్వరి సర్వసభ్య సమావేశం సోమవారం క్లబ్ అధ్యక్షులు నరహరి లక్ష్మారెడ్డి అధ్యక్షతన జరిగింది.ఇట్టి సమావేశంలో అక్టోబర్ మాసంలో క్లబ్ నిర్వహించిన సేవా కార్యక్రమాలు, వివరిస్తూ నవంబర్ మాసంలో చేపట్టే సేవా కార్యక్రమాల పై చర్చించి ఆమోదించడం జరిగింది.ఈ సందర్భంగా 2025 ,26 లైన్ స్టిక్ ఇయర్లో క్లబ్లో జాయిన్ అయిన వారికి ఇంటర్నేషనల్ లైన్స్ క్లబ్ ద్వారా పంపించిన కిట్టును అందజేయడం జరిగింది.క్లబ్బు సభ్యులైన చందుపట్ల వెంకటరమణారెడ్డి సూపర్డెంట్ గా పదోన్నతి పొందిన సందర్భంగా ఘనంగా సన్మానించడం జరిగింది

# రైస్ మిల్లర్ల దోపిడీని అరికట్టాలి

**– సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి**



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట నవంబర్ 10**

జమ్మికుంట మండల పరిధిలోని రైస్ మిల్లర్లు అన్నదాతలను నిలువునా దోపిడీ చేస్తున్నారని వారి దోపిడీని వెంటనే అరికట్టాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు.సోమవారం రోజున సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు సెంటర్లను సందర్శించి కొనుగోళ్ల తీరును పరిశీలించారు.

ఒక్కో సంచికి అదనంగా రెండు నుండి మూడు కిలోలు కాటా వేస్తూ, క్వింటాల్కు ఐదు నుండి 8 కిలోలను అదనంగా రైస్ మిల్లర్లు సొమ్ము చేసుకుంటున్నారని, ఇదేమని రైతులు ప్రశ్నిస్తే మీ దిక్కున చోట చెప్పుకొండని, మీ ధాన్యం మాకొద్దని ఎగతాళి చేస్తున్నారని రైతులు వాపోతున్నారన్నారు.

సెంటర్ నిర్వాహకులను సైతం ఇబ్బందులు పెడుతున్న రైస్ మిల్లర్లపై జిల్లా విజిలెన్స్ శాఖ వెంటనే తనిఖీలు నిర్వహించి అవినీతికి పాల్పడుతున్న రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సెంటర్ కు సంబంధం లేకుండా నేరుగా తక్కువ ధరకు రైతుల నుండి కొనుగోలు చేస్తున్న రైస్ మిల్లర్లపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గన్నీ సంచులు తిరిగి ఇవ్వకుండా కోట్లలో సొమ్ము చేసుకుంటున్న రైస్ మిల్లర్లపై జిల్లా కలెక్టర్ స్పందించి రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.

ఐకెపి కొనుగోలు సెంటర్లలో కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. తార్పాలిన్లు, మంచినీరు, దారం, గన్ని సంచులు, రవాణా సౌకర్యాలు కల్పించాలన్నారు. తేమశాతంతో నిమిత్తం లేకుండా వరిధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలన్నారు. గత రబీ సీజన్ సన్నధాన్యం బోనస్ నిధులు వెంటనే విడుదల చేయాలన్నారు. ఆరు నెలలు గడిచిన బోనస్ గురించి ఊసే లేదన్నారు.ఈ సీజన్ లో సన్న వడ్లు అమ్ముకుంటున్న రైతులకు బోనస్ రూపాయలు క్వింటాల్కు 500 నేరుగా రైతుల అకౌంట్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే భారీ వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇలాంటి సమయంలో రైతులకు అందించాల్సిన ఏ సహకారాన్నీ ఆపకూడదనీ ఆలస్యం చేయకూడదన్నారు.

అన్నదాతలను నిలువునా దోపిడీ చేస్తున్న రైస్ మిల్లర్లపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.రైస్ మిల్లర్ల దోపిడీపై జిల్లా కలెక్టర్, మరియు అదనపు కలెక్టర్లకు ఫిర్యాదులు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి శీలం అశోక్, మండల కమిటీ సభ్యులు వడ్లూరి కిషోర్, జక్కుల రమేష్ యాదవ్, దండిగారి సతీష్, సంపత్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# యువత చేతిలో దేశ భవిష్యత్తు

**– రాష్ట్రపతిచే అవార్డు అందుకున్న సాయికి సన్మానం**
**– బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం**

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**



యువత చేతిలోనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని, యువతే దేశానికి వెన్నుముక అని వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం అన్నారు. సోమవారం వేములవాడ బార్ అసోసియేషన్ హాల్లో భారత రాష్ట్రపతిచే ఉత్తమ సేవా అవార్డు అందుకున్న నమిలి గుండుపల్లె గ్రామానికి చెందిన వంగపల్లి మనీ సాయి వర్మను సదానందం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ సాయి వర్మ 2019-2023 సంవత్సరములో సీఎంఆర్ కాలేజీలో బీటెక్ చదువుతున్న సమయంలో స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ తరపున సమాజ సేవ చేసినందుకు తెలంగాణ రాష్ట్రం తరపున అవార్డు తీసుకోవడం ఆనందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణ రెడ్డి, ఏజిపి బొడ్డు ప్రశాంత్ కుమార్ , విద్యాసాగర్ రావు, జనార్దన్ సుధాకర్ రెడ్డి, అనిల్ కుమార్ నర్సింగరావు, బొడ్డు గంగరాజు గొంటి శంకర్,నరాల శ్రీనివాస్, అంజయ్య, మహేందర్, మనోహర్, శ్రీనివాస్ ,రాజశేఖర్, పర్లపెల్లి అంజయ్య,అభిలాష్ పాల్గొన్నారు.

# బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు ఎన్నికైన నూతల శ్రీనివాస్ సన్మానించిన కాకతీయ విద్యాసంస్థల చైర్మన్ సుధాకర్ రావు

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట నవంబర్ 10**



హుజురాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఎన్నికైన నూతల శ్రీనివాస్ ను ఘనంగా సన్మానించిన కాకతీయ విద్యాసంస్థల అధినేత ఆవిర్నేని సుధాకర్ రావు ఈ సందర్భంగా హుజురాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఎన్నికైన శ్రీనివాస్ శాలువాతో , పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానం చేసి ఆశీర్వచనాన్ని అందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.అదేవిధంగా పేదల పక్షపాతిగా ఉంటూ పేదలకు న్యాయం చేకూరే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ప్రస్తుత కాలమాల పరిస్థితుల రీత్యా తగు చట్టాలపై విస్తృతమైన అవగాహన సమావేశాలను ఏర్పాటు చేస్తూ పలు కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

# రాజన్న, భీమన్న సన్నిధిలో భక్తుల రద్దీ

**» కోడె మొక్కులు చెల్లించుకున్న భక్తులు**
**» రాజన్న ఆలయంలో భక్తుల రద్దీతో పోలీసుల మోహరింపు**
**» ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షించిన ఆలయ ఈవో**







**కరపత్రం ప్రతినిధి వేములవాడ**

వేములవాడ శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి దేవాలయం, అనుబంధాలయమైన శ్రీ భీమేశ్వరాలయంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది.వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు శ్రీరాజరాజేశ్వర స్వామివారిని, భీమేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. భీమేశ్వరాలయంలో అభిషేకం, అన్నపూజ తదితర ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును చెల్లించుకున్నారు. ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభమైన కారణంగా రాజరాజేశ్వర స్వామివారి దేవస్థానంలో భక్తులకు లఘు దర్శనానికి మాత్రమే అనుమతించారు. భక్తుల రద్దీ కారణంగా పోలీసులు రంగ ప్రవేశం చేసి, ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శన ఏర్పాట్లు చూశారు. అన్ని రకాల ఆర్జిత సేవలను భీమేశ్వరాలయంలోనే కొనసాగించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేపట్టారు.

**స్వామి వారికి రుద్రాభిషేకం**

సోమవారం ఉదయం శ్రీ రాజరాజేశ్వర స్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం సోమవారం సందర్భంగా 11 మంది అర్చకులు శ్రీ స్వామివారికి ప్రత్యేకమైన మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేక పూజను గావించారు.

**ఆలయం వద్ద బందోబస్తు**

వేములవాడ రాజన్న ఆలయం వద్ద పోలీసులు సోమవారం అదనపు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయం లోపలికి వెళ్ళేందుకు ప్రధాన ద్వారం మెట్ల వద్ద భారీ సంఖ్యలో భక్తులు చేరుకోవడంతో బారికేడ్లు ఏర్పాటు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఆదివారం నాడు చోటు చేసుకున్న తోపులాట దృష్టిలో ఉంచుకుని జిల్లా ఎస్పీ సూచనల మేరకు ఎస్ఐలు ఎల్లాగౌడ్, సముద్రాల రాజు, ఆలయ ఎస్పీఎఫ్ ఎస్ఐ మహేందర్ తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

# ప్రజావాణి అర్జీలను తొందరగా పరిష్కరించాలి

**– రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**

ప్రతి సోమవారం ప్రజావాణికి వచ్చే అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా తొందరగా పరిష్కరించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా సమీపృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, ఇంచార్జి కలెక్టర్ హాజరై ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.మొత్తం 86 అర్జీలు రాగా, వాటిని పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు అందజేసి, గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. అన్ని దరఖాస్తులు ఆన్లైన్లో పూర్తిగా పరిష్కరించాలని పెండింగ్ పెట్టవద్దని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు బాధ్యులు తప్పనిసరిగా ప్రజావాణికి హాజరుకావాలని స్పష్టం చేశారు. మండలాల ప్రత్యేక అధికారులు ఇందిరమ్మ ఇండ్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇతర అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అమలు పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు రాధాభాయ్, డీఆర్డీఓ శేషాద్రి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనం వికటించి విద్యార్థులకు అస్వస్థత...

**» జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన ఉపాధ్యాయులు..**
**» ఆసుపత్రిని సందర్శించిన ఎంఈఓ హేమలత...**







**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట నవంబర్ 10**

జమ్మికుంట ప్రభుత్వ బాలికల ప్రైమరీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించి 26 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఇది గమనించిన ఉపాధ్యాయులు వెంటనే పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. ప్రస్తుతం పిల్లలందరూ క్షేమంగా ఉండడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న మండల విద్యాధికారి మంతెన హేమలత హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని విద్యార్థులను పరామర్శించారు. అనంతరం విద్యార్థులను ఎందుకు ఇలా జరిగింది అని ఆరా తీయడంతో కోడిగుడ్డు తిన్న తర్వాత కడుపునొప్పి వచ్చిందని ఆ తర్వాత వాంతులు విరోచనాలు అయ్యాయని విద్యార్థులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘ నాయకులు ఆసుపత్రికి చేరుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం విద్యార్థి సంఘం నాయకులు ఎంఈఓ గో బ్యాక్ అంటూ నినాదాలు చేయడంతో కాసేపు ఆసుపత్రి వద్ద ఉద్రిక్తత నెలకొంది. అనంతరం ఎంఈఓ విద్యార్థి సంఘ నాయకులతో మాట్లాడుతూ బాధ్యులపై విచారణ జరిపి శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని ఈ విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. మధ్యాహ్న భోజన నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లనే ఈ ఘటన జరిగిందని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.